కథానిక

చరిత్రహీనులు

"అడ్డుమిల్లి"

అర్ధరాత్రి.

తెల్లటి వెన్నెల్లో జొన్న ఆకుల మీది హిమబిందువులు అణిముత్యాల్లా మెరుస్తున్నాయి.

సమారు అయిదు నిముషాల క్రితం ఎంతో దూరంలో వినిపించిన నక్కల అఱుపులు, మళ్ళీ జొన్నచేలో వినిపించాయి. హడావిడిగా 'మంచె' దిగి చేనుకడ్డంపడ్డాడు. అతనూ ఓకుక్కలా అఱచుకుంటూ ఆ నక్కలను అరఫర్లాంగుదూరంలో వున్న హైస్కూలు ఆవరణ దాటించి వెనక్కు తరిగాడు.

ఆ సరిహద్దుల్లోని తాటిచెట్లు, మామిడిచెట్లుమీది కోతులు ఆ గల్లంతు విని కిలకిలపడ్తున్నాయి. కాకుల గోల, గుడ్లగూబల వేట హుషార్లో అరిచుకుంటూ కుప్పిగంతులు వేస్తున్నాయి.

అతడు చేనుచుట్టూ ఓసారితిరిగివచ్చి 'మంచె' యెక్కాడు.

పిండి ఆరపోసినట్టుపండువెన్నెల. నిద్రపోదామనుకున్నాడు. కాని, బీడీ వెలిగించి ఆ సౌందర్య చంద్రమండలం వేపు చూశాడు. పత్తిపింజల్లాంటి తెల్లటి చిఱుమేఘాలు గాలికి సముద్రపుటలల్లా ఆటలాడుకుంటూన్నట్లు పయనిస్తున్నై. మధ్యమధ్య విడిపోతూ మళ్ళీమళ్ళీ కలుసుకుంటున్నాయి. పడమట నించి కాఱు మబ్బొకటి ఆకాశాని కెగబ్రాకుతోంది. పైనించీ నక్షత్రకాంతి, తూర్పు దిశనుండీ చంద్రకిరణాలు ఆ చిన్నారి చిరుమేఘాలకు వింత శోభను గూర్చుతున్నాయి. చల్లటి పిల్లవాయువులు ప్రకృతితో దోబూచులాడుతున్నాయి.

అతగాడికి ఈ వాతావరణంలో ఇంటివద్దనున్న భార్య గుర్తుకొచ్చింది! అతడి ఆలోచనలు అదో విధంగా భావగీతా లాలపించబోయినాయి గాని, చేనుగట్టుకు చేరువనే నక్కల కూతలు విని తృళ్ళిపడ్డాడు:

ఇంతకాలం ఎండనక, వాననక, రాయనక, రప్పనక, పురుగూ పుట్రల్ని ఖాతరుచేయక, చెమటోడ్చి, రక్తాన్ని చిందించి పండించిన బంగరు కంకులను ఆరగిస్తానికి నక్కలు అట్టహాసంగా కూర్చున్నాయి! ఈ రత్నాల రాసులను నక్కలపాలు చేయవనిందే...?? లేదు. అలా జరగటానికి వీల్లేదు. ఈ పంటతో అతడి ఊపిరి మిళితమై యుంది!

ఈసారి 'మంచె'నించి ఊరికి చేను మధ్యగా పరుగెత్తాడు. నక్కలదండు చేను చేరువలో కొచ్చేసింది. ఇంకా అయిదారుగజాల దూరంలో వున్నాయి - పదో - పన్నిండో.

నిశ్శబ్దంగా, నిదానంగా ప్రక్కనే వున్న పుట్ట చాటున మాటేశాడు.

ఆ పుటలో గాఢమవన్నె త్రాసు పాముంది. ఈలాంటి పాము లనేకం పెద్దగట్లమీది పుట్టల్లోంచి, చిన్నగట్ల మీది కాడల్లోను, వరిపనల క్రింద, అనేకసార్లుకనిపిస్తూంటాయి.

అయినా అవి వాళ్ళనేం చేసినట్లు కనడపువు అనవసరంగా. ఆ పడుచులు వాటికి పాలు పోస్తారు; పూజిస్తారు. అమాయకంగా చేతులు జోడిస్తారు. అసలు, ఆ అమాయక బ్రతుకులు, తోటి మానవులకర్థం కాకపోయినా ఆమాగ జీవాలకు తెలుసు నేమో. అంచేత వాళ్ళంత నిర్భయంగా తిరుగుతూంటారు!

ఈ నక్కలు ప్రభుత్వ సిపాయిలా బారులు తీరి రెండు జట్టులుగా చేను గట్టును దాటుతున్నాయి! కళ్లు చిన్నవిచేసి, పళ్ళు బిగపట్టి, చేతిలోని బరిసెనుగురిచూసి బరువుగావిసిరాడు. పెద్ద కమాండర్లా ముందొచ్చే ఒంటరి నక్కడొక్కలో దగబడింది.

అఱచుకుంటూ నక్కలన్నీ పలాయనం చిత్తగించాయి. ఒంటరినక్క అతడి బరిసెతోటే పారిపోతోంది. అదట్లా బాధపడ్తుంటే అతడూ బాధపడ్డాడు మనసులో. కాని, దాని హృదయానికి లేనిబాధ దేనికితడికి? అటూ యిటూ తూలుతూ, పడుతూ, లేస్తూ పారిపోయేనక్కకు కంచెదుబ్బు అడ్డమొచ్చింది. బరిసె ఊడిపోయింది. నక్క మాత్రం మరింతబాధతో ఏడుస్తూ పారిపోయింది.

బరిసెను చేతితీసుకుని, ఈ సారి మళ్ళీ రాకూడదనే వుద్దేశంతో హైస్కూలు రెండు ఫర్లాంగుల దూరంలోవున్న శ్మశానం దాటేవరకూ తిరిగాడు.

హైస్కూలు ఆవరణకూ, శ్మశానానికీ నుభయగా ఒక వాగు ప్రవహిస్తోంది. (ప్రస్తుతం వాగులో చుక్క నీరులేదు.) అది దాటి భయంకర శ్మశానంలోకి ప్రవేశించాడు.

తన లాంటి కర్షకుల కపాలాలెన్నెన్నో దొరుకుతా యక్కడ. అన్నెం పున్నెం ఎరుగని అమాయక పసిపాపలలేతకళేబరాలుకూడాఅనేకం అగపడుతాయి. యజమాన్లకు రక్త మాంసాల నర్పించిన బక్క కూలీల బొమికలు లక్షలు కన్పిస్తాయక్కడ. ఇంకా యెన్నో...

భయంకరంగా, గంభీరంగా నిర్జీవ్యంగా కన్పిస్తూంటుంది ఆ శ్మశానం. కాని, ఈ సమాజానికి పనికిరాని ఈ సంఘ వైశాచిక శాసనాల కాహుతయిన అనేకానేకాత్మల గమ్యస్థానమది: చివరకు ఈశ్మశానంలోకూడా భూమి నాక్రమించుకున్నారు పావుకాస్లు. గోరీలు, సమాధులు అనే పేరుతో.

చేనువేపుకు తిరిగాడు. శ్మశాన చివరిభాగంలో నక్కలు అఱచుకుంటూ నేవున్నాయి - వాటికి ఆకలి తీరలేదేమో! కోపంగా, నుచుచా, మంచె నెక్కాక ఒక్కసారిగా యేడ్పులు, పెడబొబ్బలు వినిపించాయతడికి.

అతడిగుండె లెందుచేతనో వేగంగా కొట్టుకోనారంభించాయి.

ఏడ్పులు ఎక్కువయ్యాయి. ఆ నిశ్చల నిశ్శబ్ద వాతావరణంలో ఏడ్పు స్పష్టంగా వినిపిస్తోంది. ఆ పొలానికి పడమటివేపుగా ఒక 'మాదిగూడెం' వుంది. అటువేపునించే ఆ రోదన...

అతనికేం తోచటంలేదు. బీడీ ముట్టించాడు. 'గూడెం' వెళ్దామనుకున్నాడు. నక్కలు గుర్తుకొచ్చాయి. అమాయకంగా ఆకాశంలోకిచూశాడు. చల్లటి పిల్లవాయుల్లోంచి చలి మెల్లమెల్లగా ఉద్భవిస్తోంది. ఆ చిన్న మబ్బు చకచకా ఆకాశాన్నాక్రమిస్తోంది.

ఏడ్పులు హెచ్చాయి. గూడెం వెళ్ళి అసలు విషయం తెలుసుకోవాలనే ఆరాటం అతనిలో ఎక్కువయింది. అతడు ఆలోచిస్తూనే గట్టుచాటాడు. శ్మశానం వరకూ తరిమిన నక్కల అరఫులు చేను దరిదాపులో వినిపిస్తున్నాయి. ఈ నక్కలు ఘల్లీ ఆచేలోకి అడుగుపెట్టాయా, చేను శ్మశానంగా మారిపోతుంది. బీడీని పారేసి హైస్కూలు వేపుకు నడిచాడు.

హైస్కూలు ఆవరణలో నిబుడి కుక్కలా అరుస్తుం మొదలుపెట్టాడు. నక్కలు బెదరి ఇంకా పైకిపోతాయని! పాపం! హైస్కూలు కాపలావానికి నిద్రాభంగమయింది. గుభాల్న లేచి నిద్రమత్తులో "ఛేయ్ ఛేయ్" అంటూ కళ్లు నలుపుకుంటూ అతనిదగ్గరకొచ్చి, అతణ్ణిమాసి, నువ్వటుండే అంటూ ప్రక్కనేవున్న రాతి తూముమీద కూర్చున్నాడు. విషయమంతా చెప్పాడు. అప్పుడుగాని, అతనికా ఏడ్పులు వినిపించలేదు! లేచి నించున్నాడు.

"ఏమక్కర్లేదు. నక్కల్నిమాత్రం యిటు రానీయకు. ఒక్క అరగంటలో వచ్చేస్తాను" అని నచ్చజెప్పి, ఓబీడీ దక్షణిచ్చుకుని, గూడెందారి పట్టాడు.

నక్కలు అరుస్తూనే వున్నాయి. అతడిగుండె వేగంగాకొట్టుకుంటోంది. అంతా అయోమయం...

2

గూడెంలోకి ప్రవేసించగానే మొట్టమొదట కనిపించేది 'రాముడి' గుడిసె! ఈ గుడిసెముందే ఇప్పుడో ఇరవైమంది గుమికూడారు. ఎక్కువమంది గుండెలు బాదుకుంటూ శోకాలుపెడ్తున్నారు.

రాముడు. ఊళ్ళో ప్రతివ్యక్తికీ అతనంటే ఇష్టమే. 'శత్రువు' అనబడేవాడు ఒక్కడులేడు. కాని అసలైన శత్రువులు వున్నారు.

అంతా అతన్ని 'పెద్దోడా' అని పిలుస్తారు. అంటే సాంకేతికపదం - 'నారాయణ జమీందారుగారి పెద్ద పాలేరు' అని! అతని వయసు పాతికేళ్ళకు మించదు.

'అతడు' చకచకా జనాన్ని వత్తిగించుకుని ముందుకు వెళ్ళాడు-ఆందోళనతో.

ఒక శవం.

ఒక శవం. ఆ శవం గుండెలమీద తలనుంచి రోదించే మరో ముసలమ్మ. చుట్టూ చేరినవాళ్ళలో కొంతమంది ఓదారుస్తుంటే, మరి కొంతమంది గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్నారు. ముందువరుసలో ఓ మూడు సంవత్సరాల పాపకూడా ఏడుస్తోంది! ఆ 'ముసలమ్మ' మాత్రం ఏడుస్తుల్లా...

అతడు నించున్నచోటే గురువాయి' వున్నాడు. పైగుడ్డ నోట్లో పెట్టుకుని ఎక్కిఎక్కిఏడుస్తున్నాడు. 'గురువాయి' ఆ గూడెంలో 'పెద్ద మాదిగ'. గురువాయిని తీసుకు ఇవతల కొచ్చాడతడు.

"ఎవర్రా గురువాయ్?"

"మన రావుడుండే..."

"ఆఁ...రావుడా..."

చకనక, ఖంగారుగా వెళ్ళి ముఖం మీది ముసుగులాగి వేశాడు. ఆఁ... రావుడే...! అతడు కొన్ని క్షణాలక్కానీ పోల్చుకోలేకపోయాడు. అతడికి రెండు కండ్లలోంచి నీరు యత్నించకుండానే వచ్చేసింది. అతడు ఏడుస్తున్నాడని అక్కడివాళ్ళుచూస్తే వాళ్ళింకా ఏడుస్తారు. ఆయాసపడతారు. ఏడవలేక ఓపికలేకపోతే సామ్మ నిల్లిపడిపోతారు. అప్పటి వాతావరణం అలాంటిది. ఆ శవంమీది గుడ్డను ఎప్పట్లాగే పరచి ఇవతలకొచ్చేశాడు.

"ఎట్లా పోయాడు?" గురువాయిని శుష్కకంఠంతో అడిగాడు.

"సంకట్లేక....."

"ఆఁ....."

"ఆడు సంకడ్తాగి ఆర్రోజుబ్బారా"

"ఆర్రోజులా! నారాయణ బాబుగారిస్తం లేదు?"

"శవంమీద కూడుతినే కుంకనాయాల్కు మనాకలి తెలవొద్దూ?" కండ్లలో నిప్పుకణాలు రగులుతున్నాయి. "మరేంటంటే! ఈయాట్టకి పదమూడురోజులయింది"

"పదమూడు రోజుల్నుంచి?"

"ఇదిగో రేపు ఇదుగో మాపంటూ గడిపేత్తాడు."

"పోనీ... మీలో ఎవరైనా..."

"హు! ఎక్కడ్తెచ్చి దొరా?"

బరువుగా మూల్గి, "అయినా యెట్టాగో యీలుసూసుకుని ఒక్కపూట సద్దాలచ్చిగాడు ఒకరోజు సద్దాడు. ఆడే యింకేడో అప్పుతెచ్చి మూడుపూట్లు సద్దేడు. అట్టాగే మూడ్రోజు ల్నెట్టుకొచ్చాం. కానీ..."

ఇకపై చెప్పలేకపోయాడు. చిన్నపిల్లవాడిలా బావురుమని, తమాయించుకుని, నోటికి గుడ్డ అడ్డంపెట్టుకున్నాడు.

'అతడు' రావుణ్ణి చూసి పదిహేను రోజులయింది.

అప్పుడెంత హుషారుగా వున్నాడు! ఎంత బలంగల రాముడెలా అయ్యాడు...! ఆ రాముడే ఇన్ని రోజుల్నించి జావలేకుండా తెల్లవారుఝామున నాల్గుగంటలనించీ రాత్రి 10గంటల వరకూ పనిచేస్తున్నాడు. చివరకు అనుభవించాడు-మరణం.

పిల్ల జమీందారు నాగాయణ! ఆయనవద్ద 'చిల్లర' వుండదు! ఎప్పటికప్పుడు రోజుకూలిస్తానికి 'చెక్కులు' మార్చాలి! వాళ్లూ, ఆ దివాణ పురాణే దాస్లూ పంచభక్ష్య పరమాణ్ణాలు తినటానికి 'చెక్కులు' మార్చక్కర్లేదు! కుక్కలకు పల్వాలూ, హల్వాలూ తయారవుతుంటాయి. డాఫర్లకు, లోఫర్లకు, కొజ్జాలకు, ముండలకు, రండలకు చెక్కు మార్చక్కర్లేదు! పాలేరుకు రోజుకూలి యిస్తానికి 'చెక్కులు' మార్చాలి!

ఈ 'చెక్కుల'న్నీ వాడబ్బగాడు కష్టపడి, శ్రమించి దాచి చచ్చిన కాణాచి! రాముడులాంటి కూలీలను ఎంతమందినిలా హత్యలు చేయకపోతే వాడలా జమీందారయ్యాడు? కనీసం రాబందులక్కూడా హృదయముంది. అవి ఎక్కువగా చచ్చినవాటినే తింటాయి. కాని, ఈ జమీందార్లు, బ్రతికున్నతోటి మానవుణ్ణే పీక్కుతింటారు. అదే వాళ్ళ 'మానవత్వం!' అదే వాళ్ల నాగరికతా సైజం! ఈ బీదలను పీక్కుతినటమే ఆ జమీందార్ల వంశ పారంపర్యా వచ్చేహక్కు భుక్తం! రాముడి శవాన్ని తీసుకువెళ్ళి వాడు, ఆ జమీందారు నారాయణ భోంచేసేప్పుడు పీటముందుపడేస్తే...

అతడి ఆలోచనలకు అంతరాయం కలిగింది. అంతా ఒక్కసారిగా పెద్ద పెట్టున ఏడ్చారు. గురువాయి పరుగెత్తాడు. అతడూను.

రెండోశవం.

రెండోశవం — ఆ 'ముసలమ్మ'ను రాముడి శవం ప్రక్కనే పడుకోబెట్టారు.

ఈసారి గురువాయి కూడా బిగ్గరగా ఏడ్చేప్పటికి, ఆ ఏడ్పులు మరీ హెచ్చాయి. సంగీతంగా ఈ రోదన ధ్వని వినిపించే వుంటుంది- జమీందారుకు.

ఆ పనిపాప...

ఆ పాప నెవరో తీసుకపోయారు-జడుసుకుంటుందని!

బలవంతానా గుర్వాయిని తీసుకుని, వాళ్లలోంచి ఇవతలకొచ్చి అడిగాడు.

"ఆ ముసలమ్మెవరు?"

"రావుడాడది బాబో..." బావురుమన్నాడు మళ్ళీ.

అంతకంటే ఎక్కువేం చేయగలడు? కాదు. ఈ కూలీ తల్చుకుంటే అసాధ్యమైందేదీ లేదు. కాని, సాహసించలేదు, భయపడ్డాడేగాని, సాహసించి ధైర్యంగా ఒక్కడుగు ముందుకు వేసిన్నాడే ఈ నిశ్శక్తజీవితం మారి పోతుంది. అసలు యీ విషయం ఆ కూలీ పెద్దకి తెలియదు. ఇంతవరకూ అతని ప్రపంచం ఆజమీందారు ఇనుప పిడికిలిలోనిదే...!

"ఆఁ...రత్తా..."

"హఁ...అదేబాబూ...బాలింత"

"బాలింతా?"

"మరేయ్యా...నిన్నకాక మొన్నే నీలాడింది..."

ఆ అమ్మాయి రత్తా...! 'ముసలమ్మ' కాదూ...? ఒహో... ముసలమ్మగా తయారయింది కాబోలు. ప్రసవించి రెండురోజులు.

అతడు రత్తిని చూసి రెణ్ణెల్లయింది.

"అటు తీసుకుపోయినపిల్ల రాముడి కూతురు గదూ?"

"మరేనండ...ఆడి పెద్దకూతురు"

"....."

"ఆ గుడ్డును యెంకడు తీసుకెళ్లాడండి..."

"ఏం...?"

"ఎంకడి పెళ్ళాం పెసవించి వారవవుద్ది. అందుకనీ..."

దూరంగా శ్మశానంలో నక్కల అఱుపులు సన్నగా వినిపిస్తున్నాయి.

"ఆఁ...గురువాయ్! ప్రొద్దున్నే ఆ పెద్దదాన్ని మనింటికి తీసుకురా...

"సరే..."

"నక్కలు తెగేడపిస్తున్నాయ్. చేనువద్దకుపోతా."

"తోడురమ్మంటారా బాబూ...'

"అహ! అక్కర్లేదు నువ్వు వీళ్ళ విషయం చూడు. నక్కలు అఱుస్తున్నాయి. పోయొస్తా....."

"చిత్తం....."

ఆ నల్లటిమేఘం ఆకాశమంతటా ఆవరించింది ఆక్రమించింది. నలుదిశలా కటికచీకటి అలుముకుంది. భయంకర కరాళ మృత్యు రక్కసి నృత్యం.....

నక్కలు అఱుస్తూనేవున్నాయి. అవును...అవెప్పుడూ, ఆకలి తీరే వరకూ అఱుస్తూనే వుంటాయి...

గ్రంథసమీక్ష

ప్రజా వాఙ్మయము

త్రైలుగు దేశంలో సాహిత్యం నన్నయ భట్టారకుడితోనో, నన్నెచోడదవుడితోనో ప్రారంభం అయిందన్నా ఆంధ్ర ప్రజల బుద్ధి వికాసం వారితోనే ప్రారంభం కాలేదు. నన్నయ, భట్టారకులకు గోరుముద్దలు తినిపించిన అమ్మలు మూగలుకారు. చిచ్చికొట్టి జోకొట్టిన అమ్మలూ మూగలుకారు.

నన్నయ, భట్టారకులకు పూర్వం నాటి సాహిత్యం గ్రంథగతం కాకపోయినా, వారి తల్లులూ, దాయిలూ అనంతమైన వాఙ్మయాన్ని కంఠస్థం చేశారు. ఆంధ్ర సాహిత్యం గ్రంథస్థం అయినాకూడా ఆ వాఙ్మయానికి ప్రాణం కంఠగతం కాలేదు. గ్రంథస్థ సాహిత్యం మాదిరిగా గాకుండా "పరగ మాధుల కైన బాగుగా తెలియగా అతివేడుకపు మాటల"పొందికతో ప్రజా వాఙ్మయం ఆంధ్రప్రజల నిత్య జీవనంలోని వివిధ దశల్నీ, అనుభూతుల్నీ కంఠస్థం చేయిస్తూ పెరుగుతూనేవుంది.

రెండువందల ఏళ్ళ పరాధీనతతో మన ఆర్థిక జీవితంతోపాటు మన సంస్కృతీ, సాహిత్యాలుకూడా గట్టి దెబ్బతిన్నాయి.

ఈ విస్మృత రూపాలను తెలుసుకొన్నవాడే వాటిని సమీకరించడానికి శ్రద్ధా భక్తీ కలుగుతాయి.

మన ప్రాచీన ప్రజావాఙ్మయం యెడా, వివిధ రూపాలయెడా భక్తి శ్రద్ధలు కలిగించేటందుకై సుప్రసిద్ధ ఆంధ్ర రచయిత శ్రీ చింతా దీక్షితులుగారు వ్రాసిన వ్యాసాల్ని ఆరింటిని విశాలాంధ్ర ప్రచురణాలయం 'ప్రజా వాఙ్మయము' అనే పేరుతో పుస్తకరూపంలో ప్రకటించారు.

శ్రీల సాహిత్యం, ఆడవాళ్ళ పాటలు, బాలవాఙ్మయం, బాల సాహిత్యం, యక్షగానం, కొరవంజి గురించి శ్రీ చింతా దీక్షితులుగారు ఆరు పరిచయ వ్యాసాలూ దీనిలో పొందుపరిచారు.

వీనికి మరో సుప్రసిద్ధ రచయిత శ్రీ చఱంపీతిక వ్రాశారు.

వెల రు. 1-8-0

ప్రతులకు :

విశాలాంధ్ర ప్రచురణాలయం

విజయవాడ-2

రామమోహన్

వాఘిరా

(అజంతానవల)

అజంతా గుహల నావరించి ప్రవహించునది వాఘిరా. బౌద్ధసంస్కృతీ కేంద్రమై విలసిల్లిన ఆ గుహలలో భారతీయ చిత్రి శిల్ప కళా సృష్టి పరాకాష్ఠనందుకున్నది. తథాగతుని శాంతి, సహన, ప్రేమబోధలు, ఆ కళా సంపద కంతకూ ఆలంబనము, జీవగర్ర.

అజంతా ఇతిహాసంగా రచించిన ఏ నవలనైనా అట్టిఉదాత్తభావప్రేరితం కావాలి. అట్టినవలకీ ప్రాచీనసంస్కృతి పట్లి. పాఠకులలో, ఆదరాభిమానాలు కలిగించగలవు.

నరసింహశాస్త్రిగారి నవల ఇందుకు పూర్తిగా విరుద్ధమైనది. భీభత్స, భయానకరసములు ఈ నవలకు ప్రాతిపదిక. వాఘిరా ఒక అనాథ బాలిక. బౌద్ధ ఆరామాధ్యక్షుడైన కుమార శ్రీనాథుడు పుత్రికా ప్రేమతో వాఘిరాను పెంచాడు. కాని వాఘిరా ఒక పులిపిల్ల. రక్షు, అసహనము ఆమెకు జన్మతః సంక్రమించిన లక్షణాలు. కొండప అను శిల్ప బాలకునితో వాఘిరాకు చెలిమి ఏర్పడి అది క్రమంగా ప్రేమగా మారుతుంది. ఈలోగా ఆమె సత్యాశ్రయపులకేశి వల్లభుని రాణివాసానికి వెళ్ళిపోతూంది.

వాఘిరా కొండపను మరచినది. మరొక బ్రాహ్మణ బ్రహ్మచారిపట్ల ఆసక్తి కలిగినది. అనూయాప్రేరితుడైన కొండప ఒక బ్రహ్మరాక్షసి బొమ్మను చిత్రించి, ఆ బ్రహ్మచారిపై ప్రయోగంచేశాడు. మరొక భూతవైద్యుడు అందుకు విరుగుడు ప్రయోగంచేశాడు. అప్పటికీ కిక్షు తీరక, కొండప, పులకేశిపై దండెత్తి వచ్చిన జాన్హవర్గమని సేనలోచేరి పులకేశిపై యుద్ధం చేస్తాడు. కొండపను వారించబోయిన వాఘిరాను, శత్రు గూఢచారిగా పులకేశి అనుమానించి కఠినశిక్ష విధిస్తాడు. అపమానభరితయైన నిరపరాధి వాఘిరా, నదిలోకూకి ఆత్మహత్య చేసుకుంటుంది. నాటినుండి ఆనది వాఘిరా అయింది.

భూత వైద్యాల, ప్రయోగాల ప్రస్తావనలోపాటు బౌద్ధ సంస్కృతి పట్లగల రచయితకుగల అయిష్టత - ద్వేషంగామారి వాచే ఇలా అనిపిస్తున్నది :- "అనాదిగా దేశములో ప్రచారములోనున్న వేదోక్త కథలు, పురాణ కథలు, జాతక, కథల పేరుతో... ప్రచారమగుట మహారాజుకు కంటకముగా నుండెను."

ఇంతకంటె చారిత్రక అసత్యం వేరొకటిలేదు. బౌద్ధ జాతక, కథలు, క్రీ. పూ. 3-4 శతాబ్దాలనాటివి. హిందూ పురాణాలు క్రీ. పూ. 2-3 శతాబ్దాలలో రచించబడినవి. భారత, భాగవత, రామాయణాది గ్రంథాలన్నీ బౌద్ధ సాహిత్యం పిమ్మట తలఎత్తినవేగాని అంతకుముందువి కాదు. కనుక గ్రంథ చౌర్యమే ఆపాదించబూనుకుంటే, అది హిందూ పురాణాలకు వర్తిస్తుంది కాని, బౌద్ధ జాతక కథలకుకాదు.

భాషకూడా సాధ్యంగాలేదు. సంకుచిత భావప్రేరితమైన ఇట్టి నవలలు భారతీయ సంస్కృతిపట్ల గౌరవ భావాన్ని కలిగించవు. పైపెచ్చు మన సంస్కృతికి అపచారం చేస్తాయి.

వెల: 1-0-0

నోరి నరసింహశాస్త్రిగారు,

రేపల్లె.

—బలరామమూర్తి

గృహాలంకరణ - ముగ్గులు

ముత్యాల రంగవల్లి ముద్దులొలుకు కంగ - రత్నాల రంగవల్లి రంగులీనంగ అని తెలుగునాట చెమ్మచెక్కలాడే చెల్లెళ్ళ పాట వినని వారు లేరు వుండరు.

ప్రతి తెలుగు పల్లెలోనూ - బస్తీలోనూ కూడా ముంగిళ్ళముందు ముగ్గులలోకే ముత్యాల ముగ్గులనూ, రంగులీనే రత్నాల ముగ్గులనూ చూడనివారూ వుండరు.

చెయి తిరిగిన చిత్రకారులు కూడా సెబాస్ అని మెచ్చుకొనే పొంకం ఈ ముగ్గులలో కనుపిస్తుంది. మేటి శిల్పులుకూడా మెలుమేలనే నేర్చు ఈ ముగ్గులలో గోచరిస్తుంది. ముగ్గులు ఒకగొప్ప కళే.

తెలుగునాటి వెలదులకు ఉగ్గుపాలతో అబ్బుతుంది ఈ కళే. అయితే అన్ని కళలలాగే ఈ కళకు కూడా ఒక శాస్త్రమూ, కొన్ని సూత్రాలూఉన్నాయి. నియమాలూ, నిబంధనలూ ఉన్నాయి.

ఆ శాస్త్రాన్నీ, ఆ సూత్రాల్నీ శ్రీ గొల్లపల్లి వెంకటేశ్వరరావుగారు చిర పరిశోధన జరిపి తవ్వితీశారు. అదే ఈ గృహాలంకరణ - ముగ్గులు అనే పుస్తకం. భారత ప్రభుత్వం వారు నిర్వహిస్తున్న సార్వజనీన గ్రంథ రచన పోటీలో ప్రథమశ్రేణి నందుకొన్న ఐదు గ్రంథాలలోనూ ఇదొకటి.

ఈ గ్రంథంలో ఆయన తొలుత చిత్రలేఖన శాస్త్రాన్ని గురించి చెప్పారు. కలయంపే వల్లడం ముగ్గులు తీర్చడాన్ని గురించి ప్రాచీన గ్రంథాలలో ఏంవుందోవివరించారు.

ముగ్గులు పెట్టే విధానాన్ని, దానికి ఉపయోగించే పరికరాల్ని వర్ణించారు. ముగ్గులలో ఎన్ని రకాలున్నాయో తెలియపరిచారు. ఆచార వ్యవహారాలను గురించీ పండగలూ సబ్బాలలో ముగ్గుల ప్రాముఖ్యాన్ని గురించీ విపులంగా చర్చించారు.

వెంకటేశ్వరరావుగారు రచయితలే కాదు. చిత్రకారులుకూడా. ఆయన స్వయంగా రచించిన చిత్రాలు ఈ పుస్తకంలో 19 ఉన్నాయి.

ఇలాంటి పుస్తకం తెలుగులో ఇదే మొదటిది అవడంవల్లనైతేనేమి, ఈ కళ మీద ఇప్పుడే తొలిసారి దృష్టి మళ్ళించడంవల్లనైతేనేమి కొన్నికొన్ని పొరపాట్లు దొర్లాయంటే అందులో అంత ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

విష్ణు ధర్మోత్తరంనుంచి చిత్రకళా విషయి విశేషాలను ఆయన ఈ గ్రంథంలో క్రోడీకరించారు. ఆక్రోడీకరణలో వర్ణలేప విధానాన్ని అదొక రకం బొమ్మగా ఆయన భ్రమించారు.

బొమ్మలకు క్షయవృద్ధులు (లైట్ అండ్ షేడ్) చూపడానికి పత్రిక - ఐరిక - బిందుకములనే మూడు పద్ధతు లున్నాయి. ఇందులో బిందుకం అనేది ఒకరకం బొమ్మ అనీ, అదే చుక్కలముగ్గు లేక పోతిముగ్గు అనీ ఆయన తొందరపడ సిద్ధాంతీకరించారు. పైగా "ఐరిక" అనడానికి బదులు అచ్చుతప్పువిడ్డ శ్లోకాన్ని పద విభాగం చేయడంలో పొరబడి "ఆహైవిక" అని కూడా వెంకటేశ్వరరావుగారు తమ పుస్తకంలో పేర్కొన్నారు.

వర్తిక అంటే కుంచె. వర్తనం అంటే ఆ కుంచెతో రంగును అద్దే విధానం. "త్రిస్రశ్చ వర్తనా ప్రోక్తా - ప్రతాహైరిక బిందుజాః" అని శ్లోకం. అంటే పత్రికం, ఐరికం, బిందుజం అని వర్తనం మూడురకాలు అని అర్థం. అంతేకాని వెంకటేశ్వరరావుగారు అనుకొన్నట్లు "మిశ్రచిత్రము పత్ర ఆహైవిక బిందుజములని" మూడురకములూకాదు. "బిందుజచిత్రములే గృహాలంకరణ మందు స్త్రీలు అలంకరించు పోతిముగ్గు"లూ కాదు.

ముగ్గులను చిత్రకళ గ్రంథాలలో ఘాళిచిత్రాలని పేర్కొన్నారు. ఈ చిత్రాలు మహారాష్ట్రలో బాగా పెంపొందాయి. వారు రంగురంగుల పిండితో వర్ణచిత్రాల మాదిరిగానే ముగ్గుల్ని రచిస్తారు.

పోతే ఇక ముగ్గులకు సంబంధించిన ఇతర నమ్మకాలను గురించికూడా రచయిత ఈ పుస్తకంలో చాలా వివరించారు. మన నమ్మకాలలో హేతువుకూ, తర్కానికీ నిలిచేవి చాలాతక్కువ. రచయిత అలాంటి వాటిని వివరించేటప్పుడు వాటిలో తాను లీనం అవకుండా దూరంగా వుండడం మంచిది. కాని వెంకటేశ్వరరావుగారు ఆ నమ్మకాలలో తాము కూడా కలిసిపోయారు.

ఇంతచక్కని పుస్తకానికి అపప్రతి కల్పిస్తున్న ఈ లోపాలను మలిముద్రణలో సవరించుకొంటారనిఆశిద్దాం.

తెలుగు ప్రజా జీవితంతో పెనవేసుకొనిపోయిన ఈ జానపద కళకు గ్రంథరూపం కల్పించిన వెంకటేశ్వరరావుగారికి ధన్యవాదా లర్పించవలసి వుంది. వారు తమ పరిశోధనను ఇంకా సాగించి ఇతర జానపద లేఖన కళలకు కూడా గ్రంథత్వం కల్పించాలని కోరుతున్నాం.

గృహాలంకరణ ముగ్గులు అన్న ఈ పుస్తకం క్రౌనుసైజు 60పుటలు. గ్లేజు కాగితంమీద ముచ్చటైన అచ్చు. వెల రెండు రూపాయలు. ప్రాప్తిస్థానం. రచయిత; 20/389 ఏలూరు రోడ్డు గవర్నరుపేట, విజయవాడ. ముగ్గులపై మురిపెం చూపే ప్రతి తెలుగు చెల్లెలూ చదవవలసిన గ్రంథం.

— కృష్ణమూర్తి.

భగ్నజీవులు

హిందీ రచయిత 'సుదర్శన్' వ్రాసిన నవల ననుసరించి శ్రీ 'వల్లజ్' రచించినది.

నూర్గత్వానికీ, మోసకారితనానికీ 'త్యాగం' అనే పేరుపెట్టి, నిరూపించడానికి చేసిన ప్రయత్నం ఇది. తేజ్ బహదూర్ తో తనకు మైత్రి వుండొచ్చు. కాని తేజ్ బహదూర్ని అసహ్యించుకొంటూ తనని మాత్రమే ప్రేమిస్తున్న రూపరాణిని దూరం కొట్టడానికి మెహతాజ్‌లో త్యాగం కన్న మూర్ఖత్వం ఎక్కువ కనుపడుతుంది. స్నేహానికీ, ప్రేమకీ వున్న విలువల తేడానీ, ఇద్దరు పురుషుల, ఇద్దరు స్త్రీ పురుషుల మధ్యవుండే సంబంధాల స్వభావాన్నీ అర్థంచేసుకోలేనిమూర్ఖత్వంఅది. ఆమూర్ఖత్వంతో మెహతాజ్ యూనివర్శిటీని వంచించడానికిగాని, తల్లిని నిరాధారంగా వదిలి పారిపోడానికిగాని సందేహించడు.

ఇటువంటి అకర్మణ్యత్వాన్నీ, అజ్ఞానాన్నీ త్యాగంగా చిత్రించే మన స్థత్వం హర్షించ తగినదికాదు.

వెల 12 అణాలు

ప్రతులకు - వినోదా పబ్లిషర్స్

విజయవాడ.

ప్రియబాంధవి

ప్రాప్తిస్థానం-

కె. ఎస్. ఆర్. అండ్ సన్స్,

బిసెంట్ రోడ్, విజయవాడ-2.

శ్రీ ప్రబోధ కుమార సన్యాల్ బంగనవల కిది శ్రీ మద్దిపట్ల సూరి అనువాదం.

స్వతంత్ర పత్రికలో ధారావాహికగా వెలువడి ఆంధ్రులకు పరిచితమైనదే కథ.

ఆధునిక సమాజపు ఒడుదుడుకులలో అకర్మణ్యులై సహజ సౌకుమార్యాలు నశించిన యువతీ యువకుల గాథ ఇది.

సుశిక్షితుడు, నిరాధారుడూ, నిరుద్యోగీ అయిన జహార్, సుశిక్షితురాలూ, గృహత్యాగినీ అయిన శ్రీమతీ యాదృచ్ఛికంగా కలుస్తారు. పరస్పరాశ్రయంలో మూడు నాలుగు రోజులు గడుపుతారు. తక్షణం గడవడానికై మోసం చేయడానికి వెనుతీయరు. సద్బ్రహ్మచారిణిగా, మహిళా మండలి కార్యకర్తగా ప్రజల్ని బీదల్నీ, ధనికుల్నీ కూడా మోసగించి డబ్బు వసూలుచేస్తారు. ఆ మోసం చేయడానికి ఒక ఆలోచనా వుండదు. పొరపాటు చేస్తున్నామనే నైతిక సంకోచమూ వుండదు. చేయవలసిందిఅదే అయినట్లూ, నిత్యం ఆ పనే చేసి చేసి అలవాటయిపోయినట్లూ, క్షణికోద్రేకంలో చేసేస్తారు. అందులో అనుతాపం, ఆనందంగాని ప్రకటించరు. సమాజ వ్యవస్థ యువతీ యువకులలో కలిగిస్తున్న అకర్మణ్యతా, సుకుమారభావ శూన్యత్వం అంత భయంకరం.

సంభాషణలు సుందరంగా కథను పరుగెత్తిస్తున్నాయి.

288 పుటల పుస్తకం వెల 3 రూపాయలు.

— రామమోహన్.

స్వీకారం

సాంస్కృతిక పునరుజ్జీవనము

రచయిత:

శ్రీ దేవులపల్లి రామానుజరావు

వెల రు 1—0—0

ప్రతులకు:

గోలకొండ పబ్లికేషన్సు,

హైద్రాబాద్.

చీమ ఆత్మకథ

రచయిత:

శ్రీ